# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 27-02-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో కరవు ప్రాంతాలుగా ప్రకటించిన జిల్లాల్లో ఉపాధిహామీ కింద 50 రోజుల అదనపు పనిదినాలు కల్పించనున్నట్లు వెల్లడించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**
2. **ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్ లో 600 కోట్ల రూపాయలను కేటాయించామని పేర్కొన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**
3. **రాష్ట్రవ్యాప్తంగా 21,170 కి.మీ మేర భూగర్భ మురుగు నీటి వ్యవస్థ నిర్మాణం చేయాల్సి ఉందని తెలిపిన పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ**
4. **విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

----------------------

వర్షాభావ పరిస్థితుల కారణంగా 2025 ఖరీఫ్ పంటకాలంలో రాష్ట్రప్రభుత్వం కరవు ప్రాంతాలుగా ప్రకటించిన జిల్లాల్లో ఉపాధిహామీ పథకం కింద 50 రోజుల అదనపు పనిదినాలు కల్పించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. అన్నమయ్య, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 37 మండలాల్లో ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదనపు పనిదినాలు కల్పించనున్నట్లు ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. దీని ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ఉపాధి పరిమితి 150 రోజులకు పెరిగి, వారికి జీవన భద్రత కలుగుతుందని తెలిపారు. గ్రామీణ పేదల సంక్షేమానికి ఈ అదనపు ప్రయోజనం కలిగించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లకు పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

-----------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అందిస్తున్న సేవలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ప్రస్తుతం 943 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు కోటి 40 లక్షల మంది ప్రజలు ఈ సేవలను పొందారని వివరించారు. వాట్సాప్ గవర్నెన్స్ కు కృత్రిమ మేధస్సును జోడించి వినియోగదారులకు సులభతరం చేశామన్నారు. ఈ వ్యవస్థను మరింత ఆధునీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.

మనమిత్ర 2.0ను త్వరలో ప్రారంభించేదిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి నారా లోకేశ్ శాసనసభలో వెల్లడించారు.

-----------------------

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు బడ్జెట్ కేటాయింపులపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 63.20 టిఎంసిల నీటితో 8లక్షల ఎకరాలకు సాగు నీరు, 30లక్షల మంది ప్రజలకు తాగు నీటితో పాటు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీరందించేలా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రూపొందించామని తెలిపారు. ఈ బడ్జెట్ లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనుల కోసం, భూసేకరణకు మొత్తం 600 కోట్లు రూపాయలు కేటాయించామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

-----------------------

రాష్ట్రవ్యాప్తంగా 21,వెల్ల170 కి.మీ మేర భూగర్భ మురుగు నీటి వ్యవస్థ నిర్మాణం చేయాల్సి ఉందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా తిరుపతిలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ నిర్మాణంపై మంత్రి సమాధానంఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 24 వేల కోట్ల రూపాయలతో భూ గర్భ మురుగు నీటి వ్యవస్థ పనులను చేపట్టామని తెలిపారు. తిరుపతిలో ప్రస్తుతం 284.3 కిమీ పరిధిలో

మురుగు నీటి వ్యవస్థ ఉండగా...మరో 125 కిమీ చేయాల్సి ఉందని వీటికి అంచనాలను సిద్ధం చేశామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 33 సెకన్లు

-----------------------

మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా పోలీసులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ -ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే అంశంపై దృశ్యమాధ్యమం ద్వారా అమరావతి నుంచి సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి రెండు రాష్ట్రాల నుంచి నోడల్ అధికారుల్ని నియమించాలన్నారు. సమాచార మార్పిడి కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని తెలిపారు. గుర్తించిన ప్రాంతాల్లో జాయింట్ ఆపరేషన్లు, నియమిత సమీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

-----------------------

విజయవాడలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. నగరంలోని బెంజ్ సర్కిల్ ప్రాంతంలో స్థానిక శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ తో కలిసి ఆయన ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల

సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేశినేని శివనాథ్ మాట్లాడారు, కృష్ణలంక వాసులకు ఉపయోగపడే విధంగా బస్టాండ్ నుంచి స్క్రూ బ్రిడ్జ్ వరకు కొత్త పైవంతెనని త్వరలో నిర్మించనున్నామని తెలియజేస్తూ.

వాయిస్ 25 సెకన్లు

-----------------------

ఏలూరు పార్లమెంటు పరిధిలో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పి. మహేష్ కుమార్ అన్నారు. ఏలూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసి, ప్రజాదర్బార్ ను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు పరిధిలో ఇప్పటివరకు 600 మందికి పైగా లబ్ధిదారులకు వైద్య ఖర్చులకోసం 5.5 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించటం జరిగిందని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు.

-----------------------

విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ రోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగరావు గారు అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద

పండితులు వేదాశీర్వచనంచేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

-----------------------

'చేరువ' పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026" కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ జిల్లాలలకు చెందిన బీజేపీ కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, కార్యచరణను గురించి వివరించారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీకి ప్రత్యేక కార్యాచరణ ఉందని, పార్టీ కార్యకర్తలు, నాయకులకు కార్యాచరణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

-----------------------

రాష్ట్రంలోని శ్రీకాకుళంలో అతిసార కేసుల నమోదు దృష్ట్యా పురపాలక శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక, పురపాలక సంస్థల్లో కలుషితం కాని. సురక్షిత నీరు అందించేలా ప్రామాణిక కార్యాచరణ విధానం-SoP ని జారీ చేసింది. అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి పైప్‌లైన్లు

తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చింది. మురుగు నీటి వ్యవస్థలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని పేర్కొంది.

-----------------------